# ఉపకారమా!

శేఖరం బ్యాంకులో గుమాస్తాగా చేరేడు. అతడు చదువుకొనే రోజుల్లో కన్న కలలన్నీ కరిగిపోయాయి. కట్టిన గాలిమేడలన్నీ కూలిపోయాయి.

బి. ఏ చదువుతున్న రోజుల్లో శేఖరానికి, జీవితం అంతా వెన్నెల వెల్లువలా కనిపించేది. లోకం అంతా పట్టు తివాసీల్లాంటి పచ్చిక బయళ్లతోటీ, ఫలపుష్పభరితాలైన ఉద్యానవనాలతోటీ, కోయిలల పాటలతోనూ, పండువెన్నెలలో వీచి పిల్లగాలుల తోనూ నిండియుండేది. పాడింది పాటగానూ ఆడింది ఆటగానూ కనిపించేది.

కాని బి. ఏ పరీక్షాఫలితాలు తెలిసిన మరునాటినుంచే, ఉద్యోగ ప్రయత్నాలు ఆరంభమయ్యాయి. వరుసగా వారం రోజులు 'హిందూ' పత్రికలోని ప్రకటనలు చూసినా, శేఖరానికి తన అభిరుచులకి సరిపోయిన ఉద్యోగం కన్పించలేదు. చుట్టుపట్ల ఉన్న కాకినాడ, రాజమండ్రి, ఏలూరు బెజవాడ వగయిరా పట్నాలన్నీ తిరిగేడు. ఆఖరికి ఏ కాలేజీలోనే నాట్యూటరు ఉద్యోగమైనా దొరుకుతుందేమోనని ప్రయత్నించేడు. లాభం లేకపోయింది. అన్ని ఉద్యోగాలూ సిఫార్సులమీదా, కులవర్గ పక్షపాతాలమీదా ఆధారపడ్డట్టు తెలియగానే, అతని కన్నులముందున్న మంచుతెరలు ఒకటొకటే తొలగిపోయాయి.

ఊరునుంచి రాగానే తనవైపు ఆశాపూరిత దృక్కులతో చూస్తూ, ఉద్యోగం దొరకలేదనగానే వైవర్ణ్యం చెందినముఖంతో నిట్టూర్పువిడిచే తల్లినీ, యీచదువుతో యిల్లుగుల్లయ్యిందని చిరాకుపడే తండ్రినీ చూచి శేఖరం హృదయంలో నిరాశా, నిస్పృహా వ్యాపించడం మొదలుపెట్టేయి. ఇంతలో ఒక పుణ్యాత్ముడు బ్యాంకులో ఒక తాత్కాలికపు ఖాళీఉందని చెవిని పడేసేడు. తండ్రి యిది విన్నలగాయతూ కాళ్లక్రింద నిప్పులుపోస్తున్నాడు. శేఖరానికి, ఆలోచించడానికి కూడా వ్యవధి లేకపోయింది. ఇంట్లో జీవితం దుర్భరమైపోతోంది. ఏదిలోటు వచ్చినా, తండ్రి "బి. ఏ ప్యాసైనవాడు అడ్డగాడిదలా యింట్లో, కుంపట్లో గుల్లాలు తప్పుతోంటే, నేనెంతకని ఏడ్వను" అని సూటిపోటి మాటలు అంటూంటే, శేఖరానికి యింతకంటె నరకమే మేలనిపించింది. బ్యాంకు గుమాస్తా పనికి దరఖాస్తు పడేశాడు.

అయినా తనకా ఉద్యోగంరాదనీ తాను అంతకంటె విలువైన దానికి ఉద్దేశింపబడ్డావనీ, అనుకోడం, మానుకోలేకపోయాడు శేఖరం. కాని ఆర్డరు రానేవచ్చింది, వెంటనే వచ్చి చేరమని. శేఖరం, పర్వత శిఖరాన్నించి పాతాళానికి పడ్డట్టు అయ్యాడు. తనకు బట్టలు లేవన్నాడు. తండ్రి ఏభైరూపాయలు బదులు తెచ్చి యిచ్చాడు. ఆ ఉద్యోగంలో జీతం సరిపోదన్నాడు శేఖరం. పైన దొరుకుతుంది అన్నాడు తండ్రి. నేను లంచాలు పుచ్చుకోను అన్నాడు శేఖరం. అఘోరించావులే అన్నాడు తండ్రి అది తాత్కాలికమే అన్నాడు శేఖరం. అదే ఖాయమవుతుందన్నాడు తండ్రి ఇది చాలక యింకా


**శ్రీ జీ. రాఘవేంద్రరావు**

ఊరంతా చాటించివచ్చాడు మాఅబ్బాయికి బ్యాంకులో ఉద్యోగం అయిందని. ఇక శేఖరానికి తప్పలేదు. ఒక శుభముహూర్తంలో బయలుదేరేడు గుడికివెళ్లే మేకపోతులా. మేనేజరు యింటిదగ్గర 'లేకపోతే బాగుం టుందనుకున్నాడు. ఆయన యింటిదగ్గరే ఉన్నాడు. శేఖరాన్ని చూసి, ఒకసారి పకిలించి "బ్యాంకుగుమాస్తాపనికి సూట్లక్కరలేదు" అన్నాడు. శేఖరానికి భావిజీవితపు చీకటిరేఖలు ఒక్కసారి హృదయానికి తట్టేయి. "సరే, యీకాగితం ఆఫీసులో ఎక్కౌంటెంటుకు చూపించు" అని మేనేజరు, వేరేపని చూసుకుంటున్నాడు. శేఖరం, బరువెక్కిన, హృదయంతో, అతృతతో, ఆందోళనతో, ఆవేదనతో బ్యాంకుకు చేరుకున్నాడు. ఎక్కౌంటెంటు పనిచేసుకుంటూ హడావిడిలో శేఖరాన్ని చూసి, కుర్చీలో కూర్చోమని సంజ్ఞచేసి తనపనిలో పడిపోయాడు. ఎక్కౌంటెంటు మంచివాడే ననిపించింది శేఖరానికి. ఇక్కడ తాను భయపడ్డంతపాడుగా ఉండదేమోనన్న అస్పష్టమైన ఆశారేఖ హృదయంలో మెదిలింది. ఎక్కౌంటెంటు పని పూర్తవగానే శేఖరం యిచ్చిన కాగితం తీసుకొని చదివి "అరే! ఎంత పొరపాటైంది! గుమాస్తాగాణ్ణి కుర్చీలో కూర్చోమన్నానే. ఆసూటుచూసి ఎవడో ఖాతాదారుడనుకున్నాను" అన్నట్టు ముఖం వికృతంగా పెట్టి, బంట్రోతును పిలిచి "ఇతణ్ణి ఆసోమయ్యదగ్గరకు తీసుకువెళ్లి చార్జీ అప్పగించమను' అని తనపనిలో నిమగ్నుడైపోయాడు.

సోమయ్య తనకీ శని ఎప్పుడు విరగడౌతుందా అన్నట్టు కుర్చీలో కళ్లుమూసుకొని కూర్చొని ఉన్నాడు. బంట్రోతు పిలవగానే, ఉలిక్కిపడిలేచి, శేఖరాన్నిచూసి ఖంగారుపడి తలగుడ్డ చుట్టుకున్నాడు హడావిడిగా ఏ ఆఫీసరో అనుకొని. బంట్రోతు భలానా అని చెప్పగానే "ఎంత వెధవపని చేసేను. తోటిగుమాస్తాగాడికోసం యింత మర్యాద ఎందుకు?" అనుకొని నొచ్చుకొని, ఒక్కసారి మళ్లీ కుర్చీలో కూలబడ్డాడు.

శేఖరం కూర్చోవడానికి కావిడిపెట్టె చూపించేడు. "ఇక ఆలస్యం ఎందుకు? చార్జీ తీసుకోండీ" అని రెండువందల నలభైమూడుఫైళ్లూ, ఒక దస్తా కాగితాలున్న అర్జెంటు కాగితాలపెద్దూ అప్పగించాడు. "ఈ కావిడిపెట్టెలోవి ఏమిటి?" అని శేఖరం అడిగాడు. సోమయ్య ఒక వెకిలి నవ్వునవ్వి "మిసలేనియస్ పేపర్లు." అన్నాడు. "అవి ఏంజెయ్యాలి" అని అడిగేడు శేఖరం. "ఏమి చెయ్యక్కర్లేదు. వాటికూడా జవాబు రాయలం పేరోజుకు యిరవైనాలుగుగంటలు సరిపోవు" అన్నాడు సోమయ్య పాపం! నువ్వు అమాయకుడవు అన్నట్టు ముఖం పెట్టి.

సోమయ్య ఒక బండెడు కాగితాలు అప్పగించిపోయాడు తల తడివిచూచుకుంటూ. శేఖరానికి ఆ కాగితాలు ఏం చెయ్యాలో బోధపడలేదు. చదివితే అర్థం కావడంలేదు బి. ఏ యింగ్లీషులో సాకందుక్లాసువచ్చినా. ఇటూ, అటూ చూసేడు. అందరు గుమాస్తాలూ తలలువంచుకొని తెగరాసేస్తున్నారు, అలా రాస్తున్నా యిలా బల్లకొద్దీ కాగితాలు ఎలా మిగులుతున్నాయో శేఖరానికి బోధపడలేదు. ఇంతలో బంట్రోతు "ఈ రోజుటపా" అంటూ ఒక బొత్తి కాగితాలు బల్లమీద పడేసిపోయాడు. అందులో కొన్నిటిమీద "అర్జెంటు" అనీ, మరికొన్నిటిమీద "వెరీ అర్జెంటు" అనీ, మిగిలిన వాటిమీద "ఈ రోజునే జవాబులు వెళ్లాలి" అనీ మేనేజరు రిమార్కులు ఉన్నాయి. వీటికి జవాబులు



"ఈ కావిడిపెట్టెలోవి ఏమిటి?" అని శేఖరం అడిగాడు.
సోమయ్య ఒక వెకిలినవ్వునవ్వి "మిసలేనియస్ పేపర్లు" అన్నాడు.

రాయడం ఎలాగో తెలియలేదు అతనికి. ఇంతలో "ఏయ్! ఓ కొత్త గుమాస్తా! ఇవ్వాళే టపాతీసుకొని యిలారా" అని ఒక కీచుగొంతుక వినపడింది. శేఖరం అటు చూసేడు. ఒక లావాటి పొట్టిమనిషి మాసిన కోటు తొడుక్కొని, తాళ్లతో కట్టిన కళ్లజోడు టేబిలుమీద పెట్టి "నిన్నే! పిలుస్తున్నది. వినబడలేదా?" అని గర్జించేడు. శేఖరం కంగారుపడి ఆయనదగ్గరకు వెళ్లి నిలబడ్డాడు. "ఆ కాగితాలేవి" అని అరుపు. శేఖరం వెళ్లి తీసుకువచ్చేడు. "వీటన్నిటికీ యివాళే జవాబులు వెళ్లిపోవాలి. తెలిసిందా? అలా చూస్తావేమిటి" అన్నాడు హెడ్‌గుమాస్తా. "నాకు వీటికి జవాబులు రాయడం ఎలాగో తెలియదు" అని జవాబిచ్చేడు శేఖరం. "మరి మూడు పూటలా మూడు కంచాలు లాగడం తెలుసా?" ఈ ప్రశ్న విసేసరికి శేఖరానికి కళ్లవెంబడి నీళ్లువచ్చేయి. ఇంత మోటుతనం-అందులో ప్రథమ పరిచయంలోనే, అతను ఎప్పుడూ ఊహించనైనా లేదు.

"నేను యీరోజునే చేరానండి. ఎలా రాయాలో చెపితే రాస్తాను." అని వినయంగా జవాబిచ్చేడు శేఖరం.

"మరే! మీ అందరికీ నేర్పడమే నా పని. నేను మీ బాబుగారి నౌఖర్ని - వెళ్లు. వెళ్లు - నీకు తోచినట్లు రాసిపట్టుకురా. ఈ బి. ఏ గాళ్లంతా యింతే - పైకి పటారం లోపల లొటారం" అని విసుక్కుంటూ హెడ్‌గుమాస్తా తనపనిలో మునిగిపోయాడు. శేఖరం సానుభూతికోసం, మిగిలిన గుమాస్తాలకేసి చూసేడు. వాళ్లు యీగొడవ వినిపించనట్లుగా ఏదో పరపర రాసేస్తున్నారు.

వాస్తవిక ప్రపంచం యింత తలక్రిందులుగా ఉంటుందని శేఖరం ఎప్పుడూ ఊహించలేదు. ఇక్కడ మానవత్వం అన్నది ఏకోశాన్నీ కనిపించనందుచేత అనివిస్తుపోయాడు. ఇంతలో గడియారం అయిదుకొట్టింది.

"అబ్బ! ఈరోజుకి పీడ విరగడయింది" అని లేచి బయలుదేరేడు శేఖరం.

"ఎక్కడికి?" అని కేకేశాడు హెడ్డుగుమాస్తా.

"టైమయిందికదండీ-వెళ్లిపోతున్నాను."

"శెభాష్! బలేగుమాస్తావి దొరికేవు. బ్యాంకుపెబ్బు తేరగా ఉందనుకున్నావు కాబోలు ఇవ్వాళటి అర్జంటు కాగితాలు రాసేవా?"

"రేపురాస్తాను."

"పనికిరాదు. ఇవ్వాళే పూర్తిచెయ్యాలి. మేనేజరుగారు వచ్చేరు. వెళ్లి సీటులో కూర్చో."

చేసేదిలేక శేఖరంవచ్చి కుర్చీలో కూల

(55-వ పేజీ చూడండి)

# ఉపకారమా?

(18-వ పేజీ తరువాయి)

బడ్డాడు. ఒకసారి కాలేజీలో ఒక లెక్చరరు కొంచెం అవమానకరంగా మాట్లాడేసరికి, శేఖరం నిలబడి ఆయన్ని ఆమాటలు ఉపసంహరించుకోమన్నాడు. ఆయన ఒప్పుకోలేదు. శేఖరం నాయకుడై సమ్మె చేయించేడు ఆయన ఒప్పుకొనేదాకా. ఆ పౌరుషం అంతా ఏమయిపోయిందో యీనాడు? ఆ శేఖరమేనా యీనాడు తలవాల్చింది? ఈ వాతావరణంలో మానవునిలో నిర్వీర్యత కలిగించే విషవాయువేదేనా ఉందేమో?— ఇలా ఆలోచించుకుంటూ శేఖరం కళ్ళు తెరిచేడు. బాగా చీకటిపడింది. ఒకళ్లిద్దరు గుమాస్తాలు గ్రుడ్డి హరికేన్‌లాంతర్లు పెట్టుకొని ఏదో రాస్తూనే ఉన్నారు యింకా. మిగిలినవాళ్లు మేనేజరు ఎప్పుడు వెళ్ళిపోతాడా అని కనిపెట్టుకూర్చున్నారు.

ఇంతలో ఒక యువకుడు వచ్చి దగ్గరబల్లమీద కూర్చున్నాడు. సుమారు తన యీడే వుంటుంది. ఇతనో గుమాస్తా. "మీకు అంతా కొత్తగా ఉందిగాబోలు. నేను మొదట యిలాగే ఫీలయ్యాను. నాలుగు రోజులుపోతే మీకూ అలవాటవుతుంది. కంగారుపడకండి." అని స్నేహభావంతో చెప్పి వెళ్లిపోయాడు.


పదిహేను రోజులు గడిచింది. శేఖరం పరిస్థితిలో ఏమీ మార్పులేదు. రోజురోజుకూ రాయవలసిన కాగితాలు పెరిగిపోతున్నాయి. హెడ్డుగుమాస్తా చీవాట్లతో పాటు. రోజు గడవడమే బ్రహ్మాండంగా తయారైంది. ప్రక్క గుమాస్తా నెవరినైనా కాస్త సాయం చెయ్యమంటే "సరిసరి - నాపనే తెమలక నేను చస్తూంటే నీకు సాయంకూడానా" అంటున్నాడు. హెడ్ గుమాస్తా దగ్గరికి వెడితే కరుస్తున్నాడు. శేఖరానికి మతిపోయేటట్టు కనబడుతోంది. రాత్రి పీడకలలువచ్చి నిద్రపట్టడం లేదు. నిద్రపడితే హెడ్డుగుమాస్తా నానాతిట్లూ తిడుతున్నట్టు కలవచ్చి ఉలిక్కిపడి లేస్తాడు. పలుగ ఆఫీసులో అంతులేని ఆవేదన.

ఒకరోజున శేఖరం ఆఫీసుకు వెళ్ళి తన కుర్చీలో కూర్చోబోతూంటే "శేఖరం! ఒకసారి యిలారా" అని హెడ్ గుమాస్తా పిలిచేడు. ఈరోజున ఆయన పిలుపులో యింత మృదుత్వం ఎలావచ్చిందా అని ఆశ్చర్యపోతూ శేఖరం దగ్గరికి వెళ్లేడు. హెడ్ గుమాస్తా పక్కన ఒక ఖద్దరు బట్టల మనిషి కూర్చుని ఉన్నాడు. "చూడు - వీరిది ఒక చెక్కుంది - అది నువ్వు తాలూకాఫీసుకు పట్టుకెళ్ళి పే ఆర్డరు వేయించుకు రద్దూ" శేఖరం ఆలోచిస్తూ నిలబడ్డాడు. "ఆలోచించక్కర్లేదు. ఆయ నేదో ముట్టచెప్తాడులే" అని చిరునవ్వు నవ్వేడు హెడ్ గుమాస్తా. శేఖరానికి వళ్ళు భగ్గుమంది, లంచం పేరు చెప్పేసరికి. "నేను వెళ్ళను. అది నా పనికాదు" అని తన సీటుదగ్గరికి వెళ్ళిపోయాడు. "ఏమిటీ - నామాట త్రోసేస్తావా? [illegible] కుదురుస్తాను" అని పళ్లు పటపట కొరికేడు హెడ్డుగుమాస్తా.

మరునాడు ఆఫీసుకు రాగానే కొత్త మిత్రుడువచ్చి "శేఖరంగారూ! మీమీద హెడ్‌గుమాస్తా మేనేజరుగారికి ఘాటైన నోటు పెట్టేడు. మీకు బహుశా కబురొస్తుంది" అన్నాడు. "మంచిదే" అని శేఖరం ఆలోచనలో పడ్డాడు. ఇంతలో ఆఫీసు బంట్రోతువచ్చి "శేఖరంగార్ని మేనేజరుగారు రమ్మంటున్నారు" అని చెప్పి వెళ్లేడు.

శేఖరం బరువుగా లేచి కోటు తగిలించుకొని బయలుదేరాడు మేనేజరుగారింటికి. గేటులో ఉన్న బంట్రోతు "అయ్యగారు ఫోంచేస్తున్నారు. ఆ బెంచీమీద కూర్చోండి వెళ్ళి" అన్నాడు. శేఖరం [illegible] హాలు కనబడుతోంది. హాలులో గోడకి ఒక ఎన్‌లార్జిమెంటు ఉంది. పురుషుడు మేనేజరుగారే - స్త్రీ - ఆయన భార్య. ఈయనకు రెండవ పెళ్ళి కాబోలు - ఆవిడ నెక్కడో చూసినట్టుందే - ఎక్కడచూసాన్లా - అని ఆలోచిస్తూ శేఖరం బెంచిమీద కూర్చున్నాడు.

ఆఫీసుగది తెరుచుకుంది. మేనేజరు గారు తువ్వాలుతో మూతి తుడుచుకుంటూ






## ★ ఉపకారమా? ★

కుర్చీలో కూర్చున్నారు. శేఖరం లోపలికి వెళ్ళేడు.

"ఏం శేఖరం - నువ్వు చేరి నెలవుతోంది. కదా ఒక్క కాగితానికి నా జవాబు రాయలేదుట ఎందుచేత? ఇది కాలేజీ అనుకున్నావా? లేకపోతే మీ యిల్లు అనుకున్నావా? ఏం! జవాబు చెప్పవేం?" అని అడిగేరు మేనేజరుగారు కళ్ళెర్రజేస్తూ.

"నాకు కొత్తగా ఉంది. ఎలా జవాబులు రాయాలో చెప్పమంటే హెడ్డుగుమాస్తాగారు చెప్పటంలేదు. తోటి గుమాస్తాలు చెప్పడంలేదు. నన్నేం చెయ్యమంటారు?"

"నీకు తెలియకపోతే నాకెందుకు వచ్చి చెప్పలేదు? పైగా నీఅంతట నువ్వు నేర్చుకోవాలి గాని, ఎవరిపనివారు చేసుకోని నీ కెవరు నేర్పుతారు? పైగా హెడ్ గుమాస్తాను అవమానం చేశావుట! ఆయన అంతర మెంత? నీఅంతర మెంత? రేపటినుంచి నిన్ను పనిలోంచి తీసేస్తున్నాను ఇకవెళ్లు." శేఖరం ఏదో చెప్పబోయాడు కాని ఆయన వినిపించుకోలేదు.

శేఖరానికి మొదట పీడ విరగడయినట్టయి హృదయం తేలికయింది. కాని ఉద్యోగం పోయాక ఏం చెయ్యాలి? అసలే కసరుసలాడే తండ్రికి ముఖం ఎలా చూపించటం? తన కొడుకు ఉద్యోగం చేస్తున్నాడని గర్వంగా పొరుగువాళ్ళతో చెప్పుకునే తల్లిదగ్గరకు వెళ్ళి ఎలా నిలబడటం? పోనీ మరొక ఉద్యోగం దొరికేదాకా యింటికి వెళ్ళకపోతే? - తనకు ఉద్యోగం యివ్వడానికి ఎవరు కాచుకుని కూర్చున్నారు? ఏపనీ లేకుండా ఎలా బ్రతకటం? - ఈ ఉద్యోగాన్ని నిరసించటం తప్పేమో? - తనకేం ఉందని అంతకంటె పెద్దది ఆశించటం? - ఎంతమంది బి. ఏ గాళ్లు గుమాస్తా పన్లు చెయ్యటంలేదు? అసలు బి. ఏ గుమాస్తాకి తప్ప మరెందుకు పనికొస్తుంది? తనకి ఇంకేవిన్ని పనులో తెలియదు. బజారులో కిళ్ళీ కొట్టు పెట్టలేడు - నలుగురిలో సిగ్గుపడకుండా నిల్చోలేడు. తన చదువు తనను గుమాస్తాగిరీ కోసమే శిక్షణనిచ్చింది. తాను మరెందుకూ పనికిరాడు. ఆ ముసలి హెడ్ గుమాస్తా నాశ్రయిస్తే తనకు పని నేర్పి ఉండును. ఉద్యోగం పోకపోవును. తన తలబిరుసు తనని యింతవరకూ తెచ్చింది - ఇలా ఆలోచించుకుంటూ గడిపేశాడు ఆరోజు శేఖరం.

మరునాడు, తాను ఆఫీసుకువెళ్ళాలో అక్కరలేదో సందేహం వచ్చింది శేఖరానికి. ఇంతలో బ్యాంకు బంట్రోతు ఒక కవరుతెచ్చి యిచ్చేడు. వణికే చేతులతో శేఖరం కవరు విప్పేడు శ్రీముఖం వచ్చిందనుకుంటూ.

నమస్కారములు—

మిమ్మల్ని మేనేజరుగారు చివాట్లు వేస్తూ ఉన్నప్పుడు నేను తలుపువెనుక నిలబడి విన్నాను. మీరు బహుశా ఉద్యోగం పోయిందనే ఆందోళనలో ఉండిఉంటారు. మీరు భయపడనక్కరలేదు. నేను మేనేజరుగారితో మాట్లాడి అంతా సర్దుబాటు చేసేను. పైగా రేపటినుంచి హెడ్ గుమాస్తాగారు మీకు సహాయంచేసే ఏర్పాటుకూడా చేసేను. మీకు ఆశ్చర్యం కలుగుతుందనుకుంటాను. కాని ఇందులో ఆశ్చర్యపడవలసినదేమీ లేదు. క్రిందటి సంవత్సరం వేసవిసెలవుల్లో నన్ను చూసుకోవడానికి వచ్చేరు మీరు. నాకు తగినంత చదువు రాదనీ, మావాళ్లు మీరు కోరినంత కట్నం యివ్వలేరనీ, మీరు మా సంబంధం తిరస్కరించేరు. అప్పుడు అలాగే జరిగి ఉండకపోతే ఈనాడు చాలీ చాలని జీతంతో రాత్రింబగళ్లు గాడిద చాకిరీ చేస్తూ, ఆఫీసర్లచేత చీటికి మాటికీ చివాట్లు తింటూ జీవితంలో ఆనందలేశమేనా లేకుండా గానుగెద్దులా బ్రతికే ఒక గుమాస్తాకు నేను భార్యనై ఉండేదాన్ని. అందువల్ల మీకు నేనెంతో ఋణపడి ఉన్నాను. ఈవిధంగా మీ ఉద్యోగం నిలబెట్టి, ఆ ఋణం కొంత వరకూ తీర్చుకున్నానని నా ఉద్దేశం.

సెలవు.

మీ క్షేమాభిలాషి, రాజ్యలక్ష్మి,

శేఖరం నిశ్చేష్టుడయ్యాడు. ఇది ఉపకారమా? లేక తన్ను నిరాకరించినందుకు ప్రతీకారమా? ఇది ప్రశ్నగా నేమిగిలిపోయింది. శేఖరం మెదడులో. ఆనాడు తాను పెళ్లిచూపులకు వెళ్లినప్పుడు కళ్ళకు కాటుక పెట్టుకొని, కాళ్లకు పసుపుతోనూ, పట్టుపరికిణీతోనూ సిల్కు జంపరుతోనూ, తన హృదయంలో స్థానంకోసం అర్థించిన రాజ్యలక్ష్మి, అతని కన్నులముందు మెరిసింది. శేఖరం

"రాజ్యలక్ష్మి-నువ్వు వ్రాసినది నిజం. ఆనాడు నేనేదో గొప్ప పదవిలోకి వెడతాననీ, నువ్వు నాకు తగవనీ, నిన్ను నేను నిరాకరించేను. ఈనాడు నువ్వు బ్యాంకు మేనేజరుగారికి భార్యవు. నేను ఆ బ్యాంకులో ఒకగుమాస్తాని" అంటూ కన్నీళ్ళు తుడుచుకున్నాడు.

★


# అతిమూత్రవ్యాధి వారం రోజులలో నెమ్మదించును

మూత్రంలో అధికంగా చక్కెరపోవుట అతిమూత్రవ్యాధిఅంటారు (Diabetes) ఇది యెంత ఉపద్రవకరమైన వ్యాధిఅంటే. దీని పాలబడినవారు ఆరోజు కారోజు మృత్యువుకు ఆసన్నమౌతుంటారు. దీనికి డాక్టర్లు ఇన్సులిన్ ఇన్‌జెక్షన్ మాత్రమే కనిపెట్టారు. వాటివల్ల వ్యాధి పూర్తిగా నయం కానేకాదు. ఇన్‌జెక్షన్ల గుణము వున్నంతకాలం మాత్రం చక్కెర తాత్కాలికంగా నిలిచిపోతుంది. ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి దాహం, ఆకలి. తరచుగా చక్కెరతో మూత్రం బయలు వెడలటము. దురద మొదలైనవి. ఈ వ్యాధి ముదిరితే రాచపుండు, కురుపులు, కంటిపొర ఇతర చిక్కులు సంభవించును. వీనస్ ఛారమ్ ఆధునిక శాస్త్రంలో అద్భుతమైన చికిత్స. దీన్ని వాడటం వల్ల వేనకు వేలమంది మృత్యుముఖంనుండి బయటపడ్డారు. దీన్ని వాడితే రెండవ లేక మూడవ రోజునుండే మూత్రంలో చక్కెర తగ్గించి అత్యధిక మూత్రం గూడ నివారిస్తుంది. మూడు రోజుల తరువాత మీకు బాగా తేలికయిస్తుంది. దీనికి పత్యం లేదు. ఇన్‌జెక్షన్లు అవసరం లేదు, ఇంగ్లీషులో వివరములుగల కరపత్రానికి వ్రాయండి. ఉచితంగా పంపుతాము.

50 బిళ్ళల బుడ్డి ఖరీదు రు 6-12-0 లు

ప్యాకింగు పోస్టేజి ఉచితము

వీనస్ రిసెర్చి లేబరేటరీ,

పోస్టుబాక్సు నం. 587, కలకత్తా (A. P. W)




రవి వెజిటబుల్ హేర్ ఆయిలు

శిరోజములను పెంపొందించి తుమ్మెద నలుపుగ నుంచి కేశ సౌందర్యమునకు తోడ్పడును. సోలెజెంట్లు

దినెస్టార్ అండ్ కో

తండియార్పేట, మద్రాసు-21.


Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras.